# సొంత గడ్డలో ఘనస్వాగతం

• చెల్లికి అండగా అన్న..



ఆనందంతో కవితను హత్తుకున్న కేటీఆర్

• స్వాగతం పలుకుతున్న సంతోష్..



శంషాబాద్ విమానాశ్రయంలో కవిత వెంట వస్తున్న సంతోష్‌కుమార్. చిత్రంలో కేటీఆర్, కవిత భర్త అనిల్, కుమారుడు ఆదిత్య తదితరులు

• ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పోవాలని..



ఇంటికి చేరుకున్న కవితకు దిష్టి తీస్తున్న మహిళ

• వ్యవసాయ కూలీల సంబురం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆత్మకూరు(ఎం) మండలంలోని రాఘవాపురం శివారులో బుధవారం పొలం వద్ద రైతులు, వ్యవసాయ కూలీలు సంబురాలు జరుపుకొన్నారు. వరి పొలంలో కలుపు తీసేందుకు వచ్చిన మహిళా కూలీలు బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి స్వీట్లు పంచుకున్నారు. – ఆత్మకూరు(ఎం)



బంజారాహిల్స్‌లోని ఇంటి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న కవిత

• పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఇంటికి..



పార్టీ కార్యకర్తలతో కలిసి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ర్యాలీగా ఇంటికి వెళ్తున్న కవిత

## కష్ట కాలంలో అన్నీ తానై..

అనుక్షణం కవితకు తోడుగా నిలిచిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): అన్న అంటే అమ్మ+నాన్న అని కేటీఆర్ రుజువు చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు రంగం సిద్ధమైన క్షణం నుంచి జైలు నుంచి ఆమె బెయిల్‌పై విడుదలయ్యే వరకు అనుక్షణం కేటీఆర్ తోడుగా నిలిచారు. ఒక అన్నగా తన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తించారు. కవితకు సంబంధించిన లీగల్ వ్యవహారాలన్నీ దగ్గరుండి చూసుకోవడమే కాకుండా మధ్యమధ్యలో తీహార్ జైలుకు వెళ్లి తన చెల్లికి భరోసానిచ్చారు. కోర్టులో బెయిల్ కోసం కృషి చేయడం నుంచి కుటుంబాన్ని ధైర్యంగా ఉంచడం వరకు.. కవిత ఎపిసోడ్‌లో కేటీఆర్ పోషించిన పాత్రకు ప్రశంసలు దక్కుతున్నాయి.

## మదినిండా సంతోషం

మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): 'సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. మీరు ఇల్లు చేరిన సందర్భంలో సంతోషంతో మది ఉప్పొంగుతున్నది' అని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగానే ఆయన తన కుటుంబ సభ్యులతో వెళ్లి స్వాగతం పలికారు. ఆమెను స్వాగతించే ఉద్విగ్న దృశ్యాలను తన ఎక్స్‌వేదికగా షేర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన 'మీరు ఇంటికి చేరడం సంతోషంగా ఉన్నది. క్లిష్ట సమయాల్లో ధైర్యం, పట్టుసడలని నిబ్బరం మీ వెంటే ఆశాదీపంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

## బీజేపీతో బీఆర్‌ఎస్ రాజీ పడలేదు

రాజీ అయితే కవిత భాష అలా ఉండేది కాదు: టీజీ వెంకటేశ్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బీజేపీతో బీఆర్‌ఎస్ రాజీ పడలేదని మాజీ మంత్రి, బీజేపీ నేత టీజీ వెంకటేశ్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీలో బీఆర్‌ఎస్ పార్టీ విలీనం అనేది హాస్యాస్పదమని అన్నారు. విలీనమే అంటే ఇంత తతంగం ఉండేది కాదని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య రాజీలేదని, రాజీ ఉంటే బెయిల్‌పై విడుదలైన తరువాత కవిత భాష అలా ఉండేది కాదని చెప్పారు.

• కిక్కిరిసిన శంషాబాద్



కవితకు స్వాగతం పలకడానికి శంషాబాద్ విమానాశ్రయానికి భారీగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు

# వసంత విహార్‌లో కోలాహలం

• కవితను కలిసేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలతో సందడి
• ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీలోని వసంత విహార్ బీఆర్‌ఎస్ శ్రేణులతో కోలాహలంగా మారింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తీహార్ జైలు నుంచి విడుదలైన ఆమె నేరుగా ఢిల్లీలోని బీఆర్‌ఎస్ కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కొందరు ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు వసంత విహార్‌లోని పార్టీ కార్యాలయంలోనే బసచేశారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఆమె బయలుదేరుతారనే విషయాన్ని తెలుసుకున్న పార్టీ శ్రేణులు, నాయకులు, వివిధ వర్గాల ప్రముఖులు తెలంగాణ భవన్‌కు చేరుకోవడంతో అక్కడ అంతా సందడిగా మారింది.

### అన్నతో ఆనందం.. కొడుకుతో వాత్సల్యం

తన అన్న కేటీఆర్, కొడుకు ఆదిత్యతో కవిత కొద్దిసేపు సరదాగా గడిపారు. ఉదయం నుంచే ఆమెను కలిసేందుకు పార్టీ శ్రేణులు పోటీపడ్డారు. హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఆమె పేరుపేరునా పలకరించారు. ఆమెతో వారు ఫొటోలు దిగారు. తనను కలిసిన జాతీయ మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. తరువాత సీబీఐ చార్జిషీట్‌పై వర్చువల్ విచారణలో పాల్గొన్నారు. అనంతరం భర్త అనిల్‌రావు, కొడుకు ఆదిత్య, అన్న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, బీ లక్ష్మారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కర్నె ప్రభాకర్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, కే వాసుదేవ రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వై సతీశ్‌రెడ్డి తదితరులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ సహా నేతలంతా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు.

## కాంగ్రెస్, బీజేపీ విమర్శలు అర్థంలేనివి

**ఆడబిడ్డ బెయిల్‌పై రాజకీయాలొద్దు: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్ అంశంపై రాజకీయాలు వద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు పలికారు. రాజకీయాలు చేయాలనుకుంటే కేసీఆర్, కేటీఆర్‌పై పోరాడాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సూచించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవితపై వచ్చిన ఆరోపణలపై కోర్టునిర్ణయం తీసుకుంటుందని, కాంగ్రెస్, బీజేపీ నేతలు అర్థంలేని విమర్శలు మానుకోవాలని కూనంనేని సూచించారు. చెరువులు, ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ భూములలో కబ్జాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రా అంటే ఆక్రమణదారులకు భయం పుట్టాలని, కూల్చివేతలు చేపట్టే ముందు పేద, మధ్యతరగతి ప్రజలకు పునరావాసం కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

## బెయిల్‌పై నీచ రాజకీయాలు

• మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితకు బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ఆ రెండు పార్టీలది అనైతిక వాదన అని, రాజకీయం కోసం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులపై బురద జల్లుతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీ మద్యం పాలసీ విషయంలో కవిత మీద మోపిన అభియోగాలకు ఎలాంటి నైతికత లేదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో మోపిన కేసు ఇదని, జాతీయ స్థాయిలో పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు, అభిప్రాయాలతో ఉన్న రెండు రాజకీయ పార్టీలు, రాష్ట్రంలో మాత్రం ఒక్కటిగా పని చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్, ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటనలు సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్ వ్యాఖ్యల విషయంలో స్పందించాలని కోరారు. మనీశ్ సిసోడియా బెయిల్, కేజ్రీవాల్ అరెస్ట్ విషయంలో నిందితులకు మద్దతు పలికిన కాంగ్రెస్.. కవిత బెయిల్ విషయంలో మాత్రం నీచ రాజకీయాలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

# పోరాటం ఆగదు

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితుల్లో వెనడుగువేసే ప్రసక్తే లేదని తెలిపారు. తన విడుదల కోసం వేచిచూసిన తెలంగాణ సమాజానికి ఆమె వినమ్రంగా చేతులెత్తి మొక్కారు. అంతిమ విజయం సాధించే దాకా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌లో తన ఇంటి వద్ద కూడా కవిత మాట్లాడారు. న్యాయం, ధర్మం గెలుస్తుందని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తామని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అనేక పోరాటాల్లో పాల్గొంటానని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### కవితకు అపూర్వ స్వాగతం

ఐదున్నర నెలల తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అపూర్వ స్వాగతం లభించింది. మంగళవారం జైలు నుంచి విడుదలైన కవిత బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరి సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కవిత వెంట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సోదరుడు కేటీఆర్, భర్త అనిల్, కుమారుడు ఆదిత్య నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు వేల మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, జాగృతి నాయకులు, మహిళా నాయకులు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, కుటుంబసభ్యులు, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు ఇతర ప్రముఖులు స్వాగతం పలికారు. జై తెలంగాణ, జై కవితక్క, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. చాలా రోజుల తర్వాత ఆమెను చూసిన బీఆర్‌ఎస్ శ్రేణులు, జాగృతి నాయకులు, మహిళలు భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులు పూలవర్షం కురిపించారు. వారికి పిడికిలెత్తి జై తెలంగాణ అంటూ కవిత అభివాదం చేశారు. వేల మంది వందల కార్లతో శంషాబాద్ నుంచి బంజారాహిల్స్ ఇంటికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ఆమె వెంటవచ్చిన వారిలో రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సునీతాలక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీమంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, బాల్క సుమన్, పైలట్ రోహిత్‌రెడ్డి, కే వాసుదేవరెడ్డి తదితులు ఉన్నారు.

### తల్లికి పాదాభివందనం చేసి..

రాత్రి ఏడు గంటల సమయంలో కవిత ఇంటికి చేరుకున్నారు. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. గులాబీ పూల వర్షం కురిపించారు. పార్టీ నాయకులు ఎదురుగా వెళ్లి స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చారు. లంబాడీ మహిళలు తమ సంప్రదాయ నృత్యాన్ని చేశారు. ఇంటి వద్ద కూడా కవిత జై తెలంగాణ అని నినదించారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కవితకు దిష్టి తీసి ఇంట్లోకి ఆహ్వానించారు. ఇంట్లోకి రాగానే పూజగదిలో దేవుడికి సాష్టాంగ నమస్కారం చేశారు. తల్లి శోభమ్మకు పాదాభివందనం చేశారు. ఆ సమయంలో ఇరువురు భావోద్వేగానికి గురయ్యారు. కవితను పరామర్శించడానికి కేటీఆర్ సతీమణి శైలిమ, హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, ఇతర బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు.

### కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత

హైదరాబాద్‌లో ఇంటికి చేరుకున్న అనంతరం తన అన్న కేటీఆర్‌కు కవిత రాఖీ కట్టారు. రాఖీ పండుగ రోజున కవిత జైల్లో ఉండి రాఖీ కట్టలేకపోయారు. దీంతో ఇంటికి చేరుకోగానే రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఆమెను కేటీఆర్ అలింగనం చేసుకొని ధైర్యం చెప్పారు. ఈ ఫొటోను కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. 'ఇప్పుడు రాఖీపండుగకు సంపూర్ణత చేకూరింది' అని పేర్కొన్నారు. కవితను ఇంటి వద్ద కలిసినవారిలో పార్టీ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, మాజీమంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పద్మా దేవేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దేవీప్రసాద్, చెరుకు సుధాకర్, గజ్జెల నగేశ్, పల్లె రవి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, మేడే రాజీవ్‌సాగర్, భిక్షపతి, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, భారత జాగృతి నాయకులు ఉన్నారు. కవిత హైదరాబాద్ రాక సందర్భంగా ఫైటర్‌కు స్వాగతం అంటూ నగరం మొత్తం కవిత ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులను ఏర్పాటు చేశారు.